సాక్షి
నల్లగొండ
శనివారం | 29 | జూలై | 2023



దళితబంధు లబ్ధిదారుల భిక్షాటన
తమకు తీరని అన్యాయం చేశారని ఆరోపిస్తూ దళితబంధు లబ్ధిదారులు శుక్రవారం కోదాడలో భిక్షాటన చేపట్టారు. - 8లో



భువనగిరిలో దొంగల బీభత్సం
గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి భువనగిరిలో తాళాలు వేసిన ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడి బీభత్సం సృష్టించారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30°/25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా బదిలీ



అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ : నల్లగొండ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా బదిలీ అయ్యారు. ఆమెను ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్‌ను నల్లగొండ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

నల్లగొండ : ఇటీవల పదోన్నతి పొందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు శుక్రవారం పోస్టింగ్ ఇచ్చారు. నల్లగొండ యూనిట్–2 ఎల్‌ఏ విభాగానికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా నరసింహారావు నియమితులయ్యారు. శంకర్ రెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎల్‌ఏ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు.

ఉద్యాన పంటలపై అవగాహన కలిగి ఉండాలి

మర్రిగూడ : రైతులు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి సంగీత లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్‌పాం, డ్రాగన్ ఫ్రూట్ పండ్లను ఎక్కువగా సాగు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 17రకాల పండ్ల తోటల పెంపకానికి సబ్సిడీతోపాటు డ్రిప్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. పంటల సాగులో మెళకువలు తెలుసుకుని అధిక దిగుబడులు సాధించే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి శ్వేత, కళాశాల చైర్మన్ సూదిని స్తంభాద్రిరెడ్డి, ట్రెజరర్ పాల్వాయి జగత్‌రెడ్డి, ఏపీఓ గుంటుక వెంకటేశం, కుంభం నర్సింహారెడ్డి, పాడిచెర్ల గిరి, వెన్నమనేని యాదగిరిరావు, బేత శోభన్‌బాబు, వెన్నమనేని అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ : నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్ణన్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మందడి శ్రీనివాసరెడ్డి, గోలి రవి తదితరులు ఉన్నారు.

‘శిథిల’ ముప్పు!



నల్లగొండ పట్టణంలోని బహర్‌పేటలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన భవనం

వర్షాలతో నానుతున్న పురాతన భవనాలు

- ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల్లో 241 ఇళ్ల గుర్తింపు
- యజమానులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- ఎప్పుడు కూలుతాయోనని ప్రజల ఆందోళన



మిర్యాలగూడ ఖమ్మం రోడ్డులో శిథిలావస్థలో ఉన్న ఇంటిని కూల్చివేయిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మున్సిపాలిటీల్లోని శిథిల భవనాలతో ముప్పు పొంచి ఉంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లోని శిథిల భవనాలు, ఇళ్లు నానిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో శిథిల భవానలను గుర్తించిన అధికారులు కొన్ని చోట్ల కూల్చివేసినా, చాలాచోట్ల నోటీసులు ఇచ్చి వదిలేశారు. దీంతో కొన్ని కుటుంబాలు ఆ భవనాల్లోనే నివాసం ఉంటున్నాయి. వర్షాల కారణంగా అవి ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు పిల్లలు ఆడుకునేందుకు ఆ భవనాల వైపు వెళితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

గుర్తింపు సరే.. కూల్చివేతలు ఏవీ?

ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల పరిధిలో అధికారులు 241 శిథిల భవనాలను గుర్తించారు. వర్షాలకు అవి కూలిపోయే ప్రమాదం ఉందని, వాటిల్లో నివాసం ఉండొద్దని సంబంధిత ఇంటి యజమానులకు నోటీసుల ఇచ్చారు. అయితే వాటి కూల్చివేత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. వర్షాల ప్రారంభానికి ముందే అలాంటి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినా ఆ తర్వాత పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారులు గుర్తించిన శిథిల భవనాలు ఇలా

మున్సిపాలిటీ	గుర్తించినవి	కూల్చినవి
దేవరకొండ	21	0
మిర్యాలగూడ	21	5
హాలియా	9	0
చౌటుప్పల్	16	0
మోత్కూర్	9	0
హుజూర్‌నగర్	5	2
తిరుమలగిరి	6	0
సూర్యాపేట	16	4
చండూరు	40	28
చిట్యాల	8	0
కోదాడ	6	1
ఆలేరు	8	1
యాదగిరిగుట్ట	19	5
భూదాన్‌పోచంపల్లి	4	0
నేరేడుచర్ల	3	0
నకిరేకల్	20	0
నల్లగొండ	23	12
నాగార్జునసాగర్	0	0
భువనగిరి	27	9
మొత్తం	241	67

ప్రమాదం అనుకుంటే కూల్చి వేస్తాం



మరమ్మతులకు వీలుకాని వాటిని పూర్తిగా కూల్చివేశాం. మరమ్మతులకు అవకాశం ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేశాం. యజమానాలు మరమ్మతులు చేయించుకుంటున్నారు. వర్షాల వల్ల వాటి నుంచి ప్రమాదం ఏర్పడుతుందనుకుంటే ఆ భవనాల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించి కూల్చి వేస్తాం.
– కెవి.రమణాచారి మున్సిపల్ కమిషనర్

మీరే కూల్చేసుకోండి..

జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీల్లో మాత్రమే అధికారులు శిథిల భవనాలను కూల్చివేశారు. చాలా చోట్ల అసలు పట్టించుకోలేదు. దేవరకొండలో కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతుండగా అత్యధిక మున్సిపాలిటీల్లో మాత్రం మీరే కూల్చేసుకోవాలని ఇళ్ల యజమానులకు చెప్పి చేతులు దులుపుకున్నారు. దీంతో కొందరు యజమానులు శిథిల భవనాల్లోనే నివాసం ఉండేందుకు వాటికి మరమ్మతు చేయించుకుంటున్నారు. అధికారులు మాత్రం శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండొద్దని గోడలపై రాసి చేతులు దులుపుకున్నారు. వర్షాలు భారీగా వస్తుండడంతో తిరుమలగిరి, మోత్కూరు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీల్లో శిథిల భవనాల్లో నివాసం ఉంటున్న వారిని వారి బంధువుల ఇళ్లకు, కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇక, నకిరేకల్ మున్సిపాలిటీల్లో ఇంతవరకు నోటీసులు కూడా జారీ చేయలేదు.



చండూరులో శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



నల్లగొండలోని అక్కచెల్మలో సగం కూలిన భవనం

‘మూసీ’ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి



మూసీ ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తున్నందున ప్రాజెక్టు గేట్ల నిర్వహణ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలసి మూసీ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, ప్రస్తుత నీటి మట్టం తదితర వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ నదీతీర ప్రాంతాల మండలాల్లోని ప్రజలకు అన్ని విధాలా సాయం అందించేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సూర్యాపేట నుంచి మిర్యాలగూడ పట్టణానికి వెళ్లే మార్గంలో లోలెవల్ వంతెన మునిగినందున రాకపోకలకు నిలిపివేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున సాధ్యమైనంత మేరకు ప్రాజెక్టులో నీటి నిల్వలను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నల్లగొండ ఆర్డీఓ రవి, ఐబీ ఈఈ భద్రునాయక్, తహసీల్దార్ ఎస్.మధుసూధన్‌రెడ్డి, మూసీ ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు మమత, స్వప్న ఉన్నారు.

ఏటీఎం కార్డులు జారీ చేయాలి

నకిరేకల్ : పోస్టాఫీసు ద్వారా ఖాతాదారులకు ఏటీఎం కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ పోస్టల్ అధికారులను ఆదేశించారు. నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీసులను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టాఫీసు వద్ద ఎక్కువగా రద్దీ ఉన్నందున ఖాతాదారులు క్యూలో ఉంచకుండా ఏటీఎం కార్డులు జారీ చేసి సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో నియోజవర్గానికి సంబంధించిన ఆర్‌ఓ కార్యాలయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్లు గుగులోతు ప్రసాద్ నాయక్, మధుసూదన్, ఇరిగేషన్ ఇంజనీర్లు స్వప్న, నకిరేకల్ డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు రాంప్రసాద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఐటీ టవర్ పరిశీలన

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న ఐటీ టవర్ భవన నిర్మాణాన్ని కలెక్టర్ కర్ణన్ శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



ప్రధాన న్యాయమూర్తికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

రామగిరి(నల్లగొండ) : కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వి.కర్ణన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.నాగరాజును శుక్రవారం జిల్లా కోర్టులోని ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తికి కలెక్టర్ మొక్కను అందజేశారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

నల్లగొండ టూటౌన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉండేందుకు నల్లగొండలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ అనిమళ్ల కొండల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం రోజూ 24 గంటలు పని చేస్తుందని, జిల్లాలో ఎక్కడైనా మెడికల్ ఎమర్జెన్సీ వస్తే వెంటనే స్పందించడానికి జిల్లాస్థాయి ర్యాపిడ్ టీం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఇలాంటి బృందాలను ఏర్పాటు చేశామని, ఏదైనా విపత్తు జరిగితే ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ఫోన్ నంబర్లు..

ఆర్.దుర్గయ్య (డీఎంఓ) 97046 04748
డాక్టర్ కె.జయ (డీఎస్‌ఓ) 99853 51499
ఆర్.అనిత (ఎపిడమాలజిస్ట్) 91548 62591
ఎం.రవిశంకర్ (డెమో) 73964 96599

దుందుబి పరవళ్లు..



డిండి–చింతపల్లి చెక్ డ్యాంపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

డిండి : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు వరవళ్లు తొక్కుతోంది. దీంతో శుక్రవారం డిండి–చింతపల్లి బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహం పెరిగింది. వరద ఇలాగే కొనసాగితే శనివారం మధ్యాహ్నం వరకు డిండి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరే అవకాశముందని నీటిపారుదల శాఖ ఏఈ ఫయాజ్ తెలిపారు. అయితే డిండి ఆయకట్టుకు నీటిని వదిలే తూముల తలుపుల మరమ్మతులకు జూన్‌లో ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. తూము మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వరద నీరు వస్తుందన్న సమాచారం అందడంతో రైతులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రామగిరి(నల్లగొండ) : కస్తూరిబా పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. తిప్పర్తిలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో గదులు తక్కువగా ఉన్నాయని, పాఠాలు వినడం, వసతి ఒకేగదిలో ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వంతో మాట్లాడి అదనపు భవన మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజలి సేవ జరిపించారు. మహిళ భక్తులు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయం, ముఖమండపం, ప్రాకార మండపాల్లో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీనరింహాస్వామి వారికి విశేష పూజలు కొనసాగాయి.

టి–30 టికెట్లను సద్వినియోగం చేసుకోవాలి


నల్లగొండ రూరల్ : ఆర్టీసీ అమలు చేస్తున్న టి–30 టికెట్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి కోరారు. శుక్రవారం నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఆమె టి–30 టికెట్లను అందజేశారు. ఈ టికెట్‌తో 30 కిలోమీటర్ల పరిధిలో రూ.50తో ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పల్లె వెలుగు బస్సులో ప్రయాణం చేయవచ్చని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రూ.20 చెల్లించి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు టికెట్లు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి

పీఏసీఎస్‌లలో ‘జన్ ఔషధి’

- పేదలకు జనరిక్ మందులు అందించాలని కేంద్రం నిర్ణయం
- గ్రామీణ స్థాయిలో అందుబాటులో ఉంచాలని యోచన
- ఉమ్మడి జిల్లాలో 18 సంఘాల్లో విక్రయానికి ఏర్పాట్లు



నల్లగొండ అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జన్ ఔషధి పేరుతో జనరిక్ మందులను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బ్రాండెడ్ మందులు కొనుగోలు చేయాలంటే గ్రామీణ స్థాయిలోని పేద ప్రజలపై అధిక ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో తక్కువ ధరలకు జనరిక్ మందులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆ దిశగా సంఘాలను ప్రోత్సహించాలని యోచిస్తోంది. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయంతో పాటుగా ధాన్యం కొనుగోలు చేస్తూ సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయి. అయితే జనరిక్ మందులను కూడా ఆయా సంఘాల్లో అందుబాటులో ఉంచి విక్రయించడం ద్వారా ఆయా సంఘాలను మరింత ఆర్థిక పరి పుష్టి సాధించేలా చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధికారుల నుంచి వివరాలను కూడా తెప్పించుకున్న సంబంధిత యంత్రాంగం ఆ దిశగా కసరత్తు చేస్తోంది.

త్వరలోనే మార్గదర్శకాలు..

మందుల అమ్మకాలు, లైసెన్స్ మంజూరు తదితర నిబంధనలకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో వెలువడనున్నాయి. జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపే సంఘాలు, ఆర్థికంగా లాభాల బాటలో ఉన్న సంఘాలు ఎంపిక చేయడానికి ఇటీవల నాబార్డు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధివిధానాలు సూచించారు. డీసీసీబీ చైర్మన్, సీఈఓ, ఇతర సహకార అధికారులు వీడియోకాన్ఫరెన్స్ పాల్గొని జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటు విషయంలో ఉన్న అనుమానాలు నివృతి చేసుకోవడంతో పాటు సాధ్యసాధ్యాలను సమీక్షించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలైన నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఆరు చొప్పున మొత్తం 18 సంఘాల్లో జనరిక్ మందులను అందుబాటులో ఉంచి తక్కువ ధరలకు విక్రయించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

తీరనున్న ఇబ్బందులు

క్షేత్ర స్థాయిలో గ్రామీణ ప్రాంతాల ప్రజల మందుల కష్టాలను తీరనున్నాయి. గ్రామాలలో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, గుండె, కీళ్ల నొప్పుల వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు మందుల కొనుగోలుకు వేలాది రూపాయలను ఖర్చుచేయాల్సి వస్తుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జనరిక్ మందులను అందుబాటులో ఉంచితే తక్కువ ధరకే అన్నిరకాల మందులు లభించి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

త్వరలోనే సంఘాలను ఎంపిక చేస్తాం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో త్వరలోనే జనరిక్ మందులను అందుబాటులో ఉంచనున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 సంఘాల్లో మందుల విక్రయానికి ఏర్పాట్లు చేస్తాం. డీసీసీబీ పాలకవర్గం, అధికారుల నేతృత్వంలో త్వరలోనే జనరిక్ దుకాణాల ఏర్పాటుకు సంఘాలను ఎంపిక చేస్తాం. జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేశాక పల్లె ప్రజలకు తక్కువ ధరలకే మందులు లభిస్తాయి.
– కె.మదన్‌మోహన్, సీఈఓ, డీసీసీబీ

భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలి

నల్లగొండ టూటౌన్ : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పానగల్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. వస్తున్న తక్కువ జీతాలు కూడా నెలనెలా ఇవ్వడం లేదని, కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం అన్యాయమన్నారు. వేతనాలు పెంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులతో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ జె.శ్రీనివాస్, కో చైర్మన్లు టి. కృష్ణ, బి.వెంకటేశం, శ్రీను, సైదులు, సంజీవరెడ్డి, వి.లెనిన్, లక్ష్మమ్మ, యాదమ్మ, సైదులు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నల్లగొండ క్రైం : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలనీకి చెందిన గద్దం నవీన్(25)కు భార్య, కూతురు ఉంది. నవీన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నవీన్ కొంతకాలంగా మద్యానికి బానిసగా మారడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నవీన్ శుక్రవారం భార్య ఓంకారేశ్వరి కూతురిని తీసుకుని బయటికి వెళ్లిన సమయంలో పురుగుల మందు తాగాడు. ఓంకారేశ్వరి ఇంటికి తిరిగి వచ్చేసరికి పక్కనే పురుగుల మందు డబ్బా, అపస్మారక స్థితిలో నవీన్ పడి ఉండడంతో లబోదిబోమంది. స్థానికుల సహాయంతో అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టు టౌన్ ఎస్ఐ సైదులు తెలిపారు.

30న చెస్ సెలక్షన్స్

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్స్ భవనంలో ఈనెల 30న సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ 2023 అఫీషియల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–11, అండర్–19 బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే స్టేట్ సెలక్షన్స్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 85550 08996, 93947 53343లను సంప్రదించాలన్నారు.

కనువిందు చేసిన మయూరాలు



పరడలో రోడ్డు వెంట సంచరిస్తున్న నెమలి

కట్టంగూర్ : కట్టంగూరు మండల పరిధిలోని పరడ గ్రామ శివారులో రహదారి వెంట శుక్రవారం మయూరాలు కనువిందు చేశాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లగా మారడంతో కట్టంగూర్ నంచి పరడ వెళ్లే దారిలో జామ తోట సమీపంలోని గుట్టల వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో రెండు నెమళ్లు రోడ్డు పక్కన సందడి చేశాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక మయూరం పురి విప్పి నాట్యం చేసింది. విధి నిర్వహణలో భాగంగా పరడ గ్రామానికి వెళ్తున్న ఎంపీడీఓ పోరెల్ల సునీత ఆ చిత్రాలను తన సెల్ ఫోన్‌లో బంధించారు.

భువనగిరిలో దొంగల బీభత్సం



భువనగిరి : జహంగీర్ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు



బాధితులతో మాట్లాడుతున్న సీఐ సుధీర్ కృష్ణ

- తాళాలు వేసిన ఐదు ఇళ్లలో చోరీ
- తొమ్మిది తులాల బంగారం, రూ.3.25 లక్షల నగదు అపహరణ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి భువనగిరి పట్టణంలో బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఐదు ఇళ్లలోకి చొరబడి బంగారు ఆభరణాలతో పాటు రూ.3.25లక్షలను చోరీ చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన పాముల జహంగీర్ ఆరు నెలల నుంచి పట్టణంలోని పోచమ్మవాడలో అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పీర్ల పండుగ సందర్భంగా భార్యతో కలిసి గురువారం స్వగ్రామానికి వెళ్లారు. యాజమాని ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం తీసి ఉన్నట్లు గమనించి వెంటనే జహంగీర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న వారు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేయడంతో పాటు ల్యాప్‌టాప్, రూ.25వేల నగదు, తులం బంగారు గొలుసు అపరణకు గురైనట్లు గుర్తించారు.

ఎల్‌బీనగర్‌లో..

భువనగిరి పట్టణంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన సిద్దంటి నిర్మల బోనాల పండుగను పురస్కరించుకుని ఉప్పల్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి ఇటీవల కుమారుడు కరుణాకర్‌తో కలిసి వెళ్లింది. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. అప్పటికే తాళం తీసి ఉన్నట్లు గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడవేశారు. అందులోని ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అదేవిధంగా ఉప్పల్‌లో జరిగిన బోనాల పండుగకు వెళ్లిన ఇందిరానగర్‌లోని పొట్ట పుష్ప ఇంట్లో తులన్నర బంగారం, రూ.2 లక్షల నగదు, భూషపాక సావిత్రి ఇంట్లో రూ.లక్ష నగదు, పల్లెర్ల ఆరాధన ఇంట్లో గ్యాస్ సిలిండర్ అపహరణకు గురైనట్లు బాధితులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుధీర్ కృష్ణ ఘటనా స్థలాలను పరిశీలించారు. పోచమ్మవాడలో సీసీ పుటేజీని పరిశీలించగా గురువారం రాత్రి 12గంటలకు ఓ వ్యక్తి చోరీ జరిగిన ఇంటి వైపు వెళ్లి తిరిగి 2గంటల తర్వాత అదే ప్రాంతం నుంచి వెళ్తున్నట్లుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందులవారి కాలనీలో భారీ చోరీ

- 16 తులాల బంగారం, 15తులాల వెండి అపహరణ

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో మనుషులు ఉండగానే చడీ చప్పుడు కాకుండా లోనికి దూరిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెరెడ్డికుంట మందులవారి కాలనీలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మందులవారి కాలనీలో నివాసముంటున్న షేక్ రబియాబి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి వేర్వేరు గదుల్లో నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత మెయిన్ డోర్ పక్కన కిటికీ గుండా దుండగులు డోరు బేడం తెరిచారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి మరో బెడ్ రూంలో ఉన్న సూట్‌కేస్ తెరిచి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం లేచి చూసిన వారికి ఇంటి తలుపులతో పాటు బెడ్‌రూంలోని సూట్‌కేస్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ గఘటనలో 16 తులాల బంగారు ఆభరణాలతో పాటు 15తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి రోనిన్ బైక్



కొత్త బైక్‌ను నడుపుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వీ టీవీఎస్ షోరూంను శుక్రవారం మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీ, అత్యధిక మైలేజీ ఇచ్చే టీవీఎస్ ప్రీమియం బ్రాండ్ రోనిన్ బైక్‌ను రంగారెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు బైక్ నడిపి యువతలో హుషారెత్తించారు. కార్యక్రమంలో షోరూం ఎండి. చైతన్యరెడ్డి, జీఎం వసంత్‌కుమార్, ఎస్ఎం సాంబయ్య, సాగర్ రెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాకుసుమాన్ని ఆదుకోరూ..

పేదవిద్యార్థి చదువుకు ఆర్థిక అడ్డంకి

- ఐఐటీ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో సీటు వచ్చినా చేరలేని పరిస్థితి
- కోర్సులో చేరాలంటే రూ.1.20లక్షలు అవసరం
- దాతలు ఆదుకుంటే కోర్సు పూర్తి చేస్తానంటున్న బాలాజీ



లావూరి బాలాజీ

మిర్యాలగూడ : చిన్నతనంలో తల్లిదండ్రుల మృతి.. ఆపై కడు పేదరికం.. అయినా వెరవకుండా పేదరికాన్ని జయిస్తూ ఇంటర్ వరకు చదివాడు.. ఇప్పటి వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే అభ్యసిన ఆ బాలుడు పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. ఇటీవల జాతీయస్థాయలో జరిగిన ఐఐటీ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరిచాడు. దీంతో జోనల్ స్థాయి ర్యాంకుల ఆధారంగా సీట్ల కేటాయింపులో జమ్మూ రాష్ట్రంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఐఐటీ) కళాశాలలో సీటు వచ్చింది. అయితే, ఆర్థిక ఇబ్బందులతో కోర్సులో చేరేందుకు జమ్మూకు వెళ్లలేక దాతల సాయం కోసం అర్థిస్తున్నాడు.. ఆ నిరుపేద విద్యార్థి.

చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందినా..

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం బెట్టెతండా గ్రామానికి చెందిన లావూరి భద్రుదస్లి దంపతుల కుమారుడు లావూరి బాలాజీ. ఇతని తల్లిదండ్రులు వ్యాధుల బారిన పడి చిన్నతనంలోనే చనిపోయారు. అయినా, మొక్కోని ధైర్యంతో బంధువుల వద్ద ఉంటూ 5వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదివాడు. అనంతరం 6–8 వరకు దామరచర్ల మండలంలోని బొత్తలపాలెంలోని మోడల్ స్కూల్‌లో, 8, 9 తరగతులు మిర్యాలగూడ ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించి ఉత్తమ జీపీఏ సాధించాడు. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ తీసుకుని బొత్తలపాలెం మోడల్ స్కూల్‌లో చదివి ఎటువంటి శిక్షణ లేకుండానే 690 మార్కులు తెచ్చుకున్నాడు. స్వశక్తితో ఐఐటీకి సన్నద్ధమై మెయిన్స్‌లో 75 పర్సంటేజ్, అడ్వాన్స్‌లో ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 690వ ర్యాంకు సాధించాడు. కష్టపడి చదివి ర్యాంకు సాధించి ఐఐటీకి ఎంపికైన బాలాజీ కళాశాలలో చేరి కోర్సు పూర్తి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కళాశాలలో చేరేందుకు, హాస్టల్ ఫీజు మొత్త కలిపి రూ.1.20లక్షలు కట్టాల్సి ఉండడంతో ఏం చేయాలో అర్థంకాక బాలాజీ అయోమయంలో పడ్డాడు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు. సాయం చేయదలచిన వారు 8464010402 నంబర్‌ను సంప్రందించాలని బాలాజీ వేడుకుంటున్నాడు. తనను ఆదుకోవాలని అర్థిస్తున్నాడు.

ఆదుకుంటే చదువుకుంటా

తల్లిదండ్రులను కోల్పోయి పేదరికంతో ఇబ్బందులు పడుతున్నా. దాతలు ఆర్థికసాయం చేస్తే ఐఐటీ కోర్స్ ఐఐటీ కోర్సు పూర్తి చేసి పేదలకు సహాయం అందిస్తా. కోర్సు పూర్తి చేసేందుకు సహకరించే వారికి నేను జీవితాంతం రుణపడి ఉంటా.

– బాలాజీ, విద్యార్థి,

దాతలు ముందుకు రావాలి...

పేద, అనాథ విద్యార్థి చదువు పూర్తికి దాతలు ముందుకు రావాలి. బాలాజీ ఐఐటీ కోర్సు పూర్తికి సంపన్నులు సహకరిస్తే అతను ఉన్నత స్థాయికి ఎదుగుతాడు.

– దశరథనాయక్, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అంతరిస్తున్న ఆదిమానవుల ఆనవాళ్లు

- సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పంబాల పర్వతాలు



పంబాల పర్వతాలు



ఆదిమానవుల కాలం నాటి సమాధులు

చందంపేట : ఆదిమానవుల ఆనవాళ్లు అంతరిస్తున్నాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయానికి చెందిన సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పంబాల పర్వతాలు పేర్కొన్నారు. తన పరిశోధనలో భాగంగా నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామ సమీపంలో శుక్రవారం ఆదిమానవుల సమాధులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సమాధులు రాతి యుగానికి చెందినవని, వేటని జీవనాధారంగా చేసుకొని జీవించిన మనిషి నది ప్రవాహక ప్రాంతాన్ని అనువుగా చేసుకొని వ్యవసాయ జీవితానికి అలవాటు పడిన కాలంటిదిగా గుర్తించారు. ఇవి దాదాపు పదివేల మెగాలిథిక్ కాలం నాటికి సంబంధించినవి కావచ్చని, సంచార జీవితం గడుపుతూ వ్యవసాయానికి అలవాటు పడి శాశ్వతంగా గ్రామాల్లో స్థిరపడడం ఈ కాలం నుంచి ప్రారంభమైందన్నారు. ఇలాంటి ప్రాచీనమైన మానవ సమాధులు నేడు అవగాహన కొరవడి కొంత మంది వాటిని తొలగిస్తున్నారని, ఇంకొంత మంది గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్థానికులతో చర్చించి వారికి అవగాహన కల్పించాలని, సమాధుల ఆనవాళ్లు పురావస్తు శాఖకు అందించి వాటిని భద్రపర్చాలని సూచించారు.

ఎన్‌టీసీఏ అవార్డుకు కంబాలపల్లి బీట్ ఆఫీసర్



కవిత

చందంపేట, నాగార్జునసాగర్ : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఎంపిక చేసిన కేంద్ర అవార్డుకు చందంపేట మండలం కంబాలపల్లి బీట్ ఆఫీసర్ ఎ.కవిత ఎంపికైనట్లు డీఎఫ్ఓ సర్వేశ్వర్ తెలిపారు. గ్లోబల్ టైగర్ డే సందర్భంగా ఈ నెల 29న ఉత్తరాఖండ్‌లో కేంద్ర పర్యావరణ మంత్రి చేతుల మీదుగా కవిత అవార్డును అందుకోనున్నారు. మొదటిసారిగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఈ అవార్డుకు కవిత ఎంపిక కావడం విశేషం.

వారెవ్వా.. 'సామాజిక' బాధ్యత

- ఇంటినుంచి వెళ్లిన బాలురను పట్టించిన సోషల్ మీడియా
- వాట్సాప్‌లో చూసి చిన్నారులను గుర్తించిన మెదక్ పోలీసులు
- సంరక్షణలోకి తీసుకుని.. తల్లిదండ్రులకు సమాచారం

యాచారం: ఇంటి నుంచి వెళ్లిపోయిన అన్నదమ్ములు సోషల్ మీడియా చొరవతో తల్లిదండ్రుల వద్దకు చేరారు. సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన శ్రీను, రేణుక దంపతులకు ఇద్దరు కొడుకులు సంతానం(మైనర్లు). తల్లిదండ్రులు మాల్ మార్కెట్‌లో నివాసం ఉంటూ పదేళ్లుగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ నిద్రలేచి ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఉదయం 5గంటలకు తండ్రి లేచిచూడగా కుమారులు కనిపించలేదు. కాసేపు చుట్టుపక్కల వెతికినా జాడ కనిపించకపోవడంతో యాచారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాల్ మార్కెట్లోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ విషయం రోజంతా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో మెదక్ బస్టాండ్‌లో వీరిని గుర్తించిన స్థానిక పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మెదక్ పోలీసుల సంరక్షణలో ఉన్న తమ కుమారులను తెచ్చుకునేందుకు తల్లిదండ్రులు అక్కడకు బయలుదేరారు.

అదుపుతప్పి లారీ బోల్తా

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం గ్రామశివారులో శుక్రవారం ఉదయం అతివేగంతో పోచంపల్లి వైపు వస్తున్న ఇటుకల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

జాతీయ రహదారిపై తగ్గిన వరద



కోదాడ వద్ద హైవేపై నిలిచిన వాహనాలు

కోదాడ రూరల్ : భారీ వర్షాలకు మున్నేరు వాగు రెండు రోజులు ఉధృతంగా ప్రవహించింది. దీంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్‌లోని కీసర టోల్‌గేట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఐతవరం వద్ద జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం వరద ఉధృతి కొంత తగ్గడంతో రాకపోకలను పునరుద్ధరించారు. గురువారం వాహనాలను హుజూర్‌నగర్, మిర్యాలగూడ మీదుగా దాచేపల్లి, పిడుగురాళ్ల, గుంటూరు నుంచి విజయవాడకు మళ్లించారు. భారీ, ఎక్కువలోడ్ ఉన్న వాహనాలు మాత్రం కోదాడ వద్దనే రోడ్డు వెంట నిలిపివేశారు. అదే విధంగా నందిగామ, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు కూడా రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్‌లో నిలిచాయి. అన్ని వాహనాలు తిరిగి శుక్రవారం రాత్రి నుంచి నేరుగా వెళ్తున్నాయి.

ఆగస్టు 7న ఢిల్లీ వర్సిటీలో 'వీవర్స్ ఆఫ్ ఇండియా' ప్రదర్శన

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ గ్రామానికి చెందిన గంజి రఘు చేనేత కళలపై తీసిన 'వీవర్స్ ఆఫ్ ఇండియా' డాక్యుమెంటరీని జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7న ఢిల్లీ యూనివర్సిటీలోని ఇంద్రప్రస్థ ఉమెన్స్ కాలేజీలో ప్రదర్శిస్తామని ఆ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ దండ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులకు చేనేత కళ గురించి వివరించాలని ఆయన రఘును ఆ ప్రకటనలో కోరారు. స్వతహాగా రఘు చిన్నతనం నుంచి చిత్రకారుడు. ఆయన గీసిన చిత్రాలు, తీసిన డాక్యుమెంటరీలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయని తెలిపారు. తాను తీసిన డాక్యుమెంటరినీ ఢిల్లీ యూనివర్సిటీలో ప్రదర్శించబోతున్నందుకు సంతోషిస్తున్నట్లు రఘు తెలిపారు.

కులం పేరుతో దూషించిన నలుగురికి జరిమానా

రామగిరి(నల్లగొండ): కులం పేరుతో దూషించిన నలుగురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ ఎస్సీ ఎస్టీ కోర్టు ఇంచార్జి జడ్జి బి.తిరుపతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన బక్క శేఖర్ 2018 నవంబర్ 17న రాత్రి చౌటుప్పల్ మండలం లక్కారం చర్చి నుంచి వెళ్తున్న సమయంలో సమీపంలోని బ్రిడ్జి వద్ద కొంత మంది వాల్ పోస్టర్ అంటిస్తున్నారు. హిందూ వాహిని సంస్థకు చెందిన కానుగు వెంకటేశం, దొమ్మాటి రాజశేఖర్, రాచకొండ శ్రీధరచారి, కానుగు సాయి కుమార్‌లు శేఖర్‌ను అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని బక్క శేఖర్ వారిని ప్రశ్నించడంతో వారందరూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. వారి నుంచి తప్పించుకొని బాధితుడు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఏసీపీ వి.బాపురెడ్డి, సీఐ పి.వెంకటేశ్వర్లు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి బి.తిరుపతి సెక్షన్ 323 కింద నలుగురు నిందితులు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, చెల్లించని పక్షంలో నెల రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

ఆలయానికి వెండి కవచం, గడప బహూకరణ



బహూకరించిన వెండి కవచం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సికింద్రాబాద్‌లోని శేరుపల్లి జూవెలర్స్‌కు చెందిన శ్రీనివాస్ రజిత 499గ్రాముల వెండి గడప, 2కిలోల 34గ్రాముల వెండి కవచాన్ని బహూకరించారు. శుక్రవారం శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆండాళ్ దేవికి ఇష్టమైన రోజు కావడంతో 2కిలోల 34గ్రాముల వెండితో తయారు చేసిన కవచాన్ని, 499గ్రాముల వెండి గడపను ఈఓ గీతారెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ గీతారెడ్డి లడ్డూ ప్రసాదం అందజేశారు.

నిలిచున్న డీసీఎంను ఢీకొన్న లారీ

- ఒకరి దుర్మరణం.. మరొకరికి గాయాలు

నార్కట్‌పల్లి : హైవేపై నిలిచున్న డీసీఎంను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మండలం మల్కాపురం నుంచి హైదారాబాద్‌లోని శివాని ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన ఏషియన్ పెయింట్ రంగు డబ్బాలను డ్రైవర్ రాంలక్ష్మణ్ వర్మ (35) లారీలో లోడ్ చేసుకున్నాడు. అక్కడ పనిచేసే సెక్యూరిటీ గార్డు పృథ్వీరాజ్ వెంట వస్తాననడంతో ఎక్కించుకుని వైజాగ్‌కు బయలుదేరాడు. పృథ్వీరాజ్ లారీని నడుపుతానని కోరడంతో డ్రైవర్ రాంలక్ష్మణ్ వర్మ అతడికి స్టీరింగ్ ఇచ్చి పక్కన కూర్చొని సూచనలు చేస్తున్నాడు. లారీ పెద్దకాపర్తి శివారుకు రాగానే టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టి బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ రాంలక్ష్మణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా పృథ్వీరాజ్ వర్మ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌పోర్టు సూపర్‌వైజర్ సత్యంకుమార్ శుక్లా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ జాన్‌రెడ్డి తెలిపారు.

ఊరు చీకట్లో మగ్గుతోందని..

- చెరువును తలపించేలా నీరున్నా విద్యుత్ స్తంభం ఎక్కి..
- మరమ్మతులు చేసి విద్యుత్ సమస్యను తీర్చిన యువకుడు
- సంతోష్‌గౌడ్ సాహసాన్ని అభినందించిన మంత్రి జగదీశ్‌రెడ్డి



పాతర్లపహాడ్‌లో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న సంతోష్‌గౌడ్



సంతోష్‌గౌడ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అసలే ఎడతెరిపి లేని వర్షాలు, ఆపై చెరువును తలపించేలా చుట్టూ నీరు.. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఊరు ఊరంతా చికట్లో మగ్గిపోతోంది. దీనిని చూడలేని ఓ యువకుడు తన ప్రాణాలను ఫణంగా పెట్టి సాహసం చేశాడు. నీటిలో ఈదుకుంటూ వెళ్లి.. విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేసి విద్యుత్ సమస్యను తీర్చాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కొప్పుల సంతోష్ గౌడ్ స్థానిక లైన్‌మన్ కింద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీనికి తోడు గ్రామానికి పైభాగంలో ఉన్న అయ్యవారికుంట తండా చెరువు నుంచి శంభుని చెరువుకి వచ్చే కరకట్ట తెగిపోయింది. ఈ వరదంతా పాతర్లపహాడ్‌లోని ముదిరాజ్ కాలనీని ముంచెత్తింది. దీంతో గురువారం రాత్రి నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీన్ని సరిచేయాలని ప్రయత్నించగా చెరువును తలపించేలా చుట్టూ వరద నీరు ఉన్న ఓ స్తంభంపై సమస్య ఉందని గుర్తించారు. ఈ స్తంభంపై మరమ్మతులు చేస్తేనే గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుందని, లేదంటే చీకట్లోనే గడపాల్సి ఉందని భావించారు. విధి నిర్వహణలో భాగంగా అక్కడే ఉన్న విద్యుత్ హెల్పర్ సంతోష్ గౌడ్ వరదను లెక్కచేయకుండా దిగాడు. చాలా దూరం ఈదుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి మరమ్మతులు పూర్తి చేసి క్షేమంగా తిరిగి వచ్చాడు. సంతోష్ గౌడ్ చేసిన సాహసానికి గ్రామ ప్రజలే కాకుండా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

కోదాడలో దళితబంధు లబ్ధిదారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కోదాడ: దళితబంధు పథకం కింద తమకు మంజూరైన నిధులను గ్రామానికి చెందిన కొందరు నేతలు కాజేశారని ఆరోపిస్తూ సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండకు చెందిన దళితబంధు లబ్ధిదారులు శుక్రవారం కోదాడలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు మంజూరైన దళితబంధు యూనిట్ల కోసం ప్రతి ఒక్కరి నుంచి రూ.2లక్షలు వసూలు చేశారని, డబ్బులు ఇవ్వకపోతే తమకు మంజూరైన గేదెలను కూడా లాక్కుపోయారని వాపోయారు. దళితుల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకంలో దళారులు తమను దోచుకున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మర్రి యేసమ్మ, కొప్పుల పద్మ, గొర్రెముచ్చు సిద్ధయ్య, ఊదర అశ్విని, కందుల మేరమ్మ, మాదాసు రామకృష్ణ, కాలే గోపి, మాదాసు నాగరాజు, ఏడుకొండలు పాల్గొన్నారు.